క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై అవగాహన



ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో శుక్రవారం ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ రాజు పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లను విధిగా వాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం గోవిందమ్మ, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, ఆశావర్కర్లు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

11న క్రీడా పోటీలు

నారాయణపేట రూరల్: జిల్లా మహిళాభివృద్ధి – శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సాధికారికత కేంద్రం వారు నిర్వహిస్తున్న బేటీ బచావో – బేటీ పడావో పథకంలో భాగంగా ఈ నెల 11న క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కో –ఆర్డినేటర్ నర్సింహులు తెలిపారు. నారాయణపేట, ఊట్కూర్, ధన్వాడ మండలాలకు చెందిన బడి మానిన అమ్మాయిలు, ఓపెన్ స్కూల్ విద్యార్థినులకు స్థానిక మినీస్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ఆటాపోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు ఈ నెల 25న జిల్లా స్థాయి క్రీడలు నిర్వహిస్తామన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



ధన్వాడ: కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు ఉదయభాను అన్నారు. శుక్రవారం మండలంలోని కంసాన్‌పల్లిలో అభియాన్ కార్యక్రమంలో భగంగా ఇంటింటికీ తిరిగి బీజేపీ ప్రభుత్వ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ మరుగుదొడ్లు, రేషన్ బియ్యం, సిలిండర్లు అందజేసిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాకం సురేందర్, నర్సింహులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



దామరగిద్ద: పౌష్టికాహారం తీసుకుంటు నేటి బాలలు ముక్తు ఎనిమియ దిశగా కృషిచేయాలని డాక్టర్ మోనేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ముక్తు ఎనిమియ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, కొలతలు తీశారు. రక్తనమునాలు సేకరించారు. పౌష్టికాహారం లోపం నివారణకు ముందస్తు పరీక్షలు చేసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసునమోదు

మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన యువతి నాజీయబేగం (21)అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన మహబూబ్‌కు ముగ్గురు సంతానం, మహబూబ్ రెండు రోజుల క్రితం స్నేహితులతో కలిసి విహార యాత్రాలకు వెళ్లారు. అదేరోజు పెద్ద కూమారుడు హైదరాబాద్‌కి వెళ్లగా ఇంట్లో భార్య, కూతురు, చిన్నకూమారుడు ఉన్నారు. తల్లి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి నాజీయబేగం ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ఇళ్లతో పాటు బంధువుల ఇళ్లలో వెతుకగా ఎక్కడ కనిపించలేదు. దీంతో విహార యాత్ర నుంచి తండ్రి తిరిగి వచ్చి కూతురు అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో పురంధరదాసుల ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిమళాపురంలోని పురవీధుల గుండా భక్తిసంకీర్తనలతో హరిదాసుల సంకీర్తలన నడుమ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ అర్చకులు నర్సింహచారి, రాఘవేందర్‌రావు, ప్రహ్లాద రావు, అనంతరావు, ధరణీధర్, ప్రకాష్, హేమంత్, మంజునాథ పాల్గొన్నారు.



28 గ్రామాలకు ఒకే బ్యాంక్

- వేల మంది ఖాతాదారులు
- నగదుకోసం తప్పని తిప్పలు..
- సేవలకోసం గంటల తరబడి నిరీక్షణ
- మరో బ్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్



మాగనూర్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఫైల్)

మాగనూర్: మండల కేంద్రంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలందిస్తోంది. గతంలో మండలంలోని మరో బ్యాంక్ ఏర్పాటు చేస్తామని అధికారులు కొన్నిరోజుల పాటు అలజడి చేసిన మళ్లీ అటువైపుగా ప్రయాణం సాగలేదు. దీంతో చాలా మంది గ్రామీణ వికాస్ బ్యాంక్‌లోనే ఖాతాలు తెరిచారు. 16 రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 28 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 19 గ్రామాల వారికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ కేటాయించారు. దీనిపై 10వేల మంది ఖాతాదారులు ఆధారపడి ఉన్నారు. వ్యవసాయదారుల ఖాతాలు, సేవింగ్ ఖాతాలు 19,333 ఉన్నాయి. ఇంకా స్వయం సహాయక సంఘాల ఖాతాలు 384, ఇతర కరెంట్ ఖాతాలు, క్రెడిట్ కార్డు ఖాతాలున్నాయి.

నగదుకోసం తప్పని తిప్పలు..

రైతుబంధు, పంటరుణాలు, మహిళా సంఘాల రుణాలతోపాటు రోజు వారీ సాధరణ లావాదేవీలు జరుగుతాయి. అయితే పంట పెట్టుబడులతో పాటు ఆర్థిక అవసరాల కోసం నగదు అవసరమైన ఖాతాదారులు ఎదుట పడిగాపులు పడుతున్నారు. రుణాల కోసం రైతులు, మహిళా సంఘాలు, వ్యాపారస్తులకు సకాలంలో నగదు దొరకక ఇబ్బందులు పడుతున్నారు.

అధిక శాతం ..

ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల్లో అత్యధికంగా ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు ఉన్నారు. వీరిలో అధికంగా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, రైతులు ఎస్‌బీఐలో ఖాతాలు పొంది ఉన్నారు. ఎవైన లావాదేవీలకోసం 10కిలో మీటర్ల దూరంలో ఉన్న మక్తల్‌కు వెళ్లాలి. దీంతో సమయంతోపాటు డబ్బులు వృథావుతున్నాయని వాపోతున్నారు. అందుచేత మాగనూర్ మండలంలో మరో బ్యాంక్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఒకే బ్యాంక్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా ఏవైనా ప్రభుత్వ పనులకోసం డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్తే రెండు, మూడు రోజులైన డబ్బులు లేవు అంటున్నారు. పంటల సాగు సమయంలో సమయానికి డబ్బులు అందడం లేదు. ప్రైవేట్ అపరేటర్ల వద్దకు వెళ్తుంటే కమీషన్లు తీసుకుంటున్నారు.

– రాజు మాజీ సర్పంచ్, మాగనూర్

సమయం వృథా అవుతుంది..



ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఖాతా ఉండటంతో ఎద్దైన లావాదేవీల గురించి వెళ్లాలంటే అన్ని పనులు వదులుకుని వెళ్లాల్సి వస్తుంది. దీంతో సమయం వృథాతోపాటు అధిక ఖర్చులు అవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరో బ్యాంక్ ఏర్పాటు చేయాలి.

– మహదేవ్, మాగనూర్

కొనసాగుతున్న సర్వే



కోస్గిలో సర్వే చేస్తున్న అధికారులు

కోస్గి: మండల పరిధిలో ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వేను అధికారులు నిరంతరంగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని నాగులబావికి సంబంధించిన సర్వే నంబర్ 1650లో అధికారులు సర్వే నిర్వహించారు. విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. భూమికి సంబంధించిన హద్దులను గుర్తించి మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు అందించారు. భూమిని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ కమీషనర్‌కు సూచించారు. ఇదే క్రమంలో పట్టణంలో ఉన్న పలు ప్రభుత్వ భూములను గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ అరుణ, ఆర్‌ఐ హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది హన్మంతుతోపాటు పలువురు పాల్గొన్నారు.

కోస్గి (మద్దూరు): కొత్తపల్లి మండలంలోని కొటకొండ క్రషర్ నుంచి గుండుమాల్ వరకు, మద్దూరు నుంచి లింగల్‌చేడ్ వరకు అర్ అండ్‌బీ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చడానికి అధికారులు శుక్రవారం కొత్తపల్లి వద్ద సర్వే నిర్వహించారు. ఈ రెండు రోడ్లు కొడంగల్ డెవలప్‌మెంట్ అథారటీ (కడా) అధికారి ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు అర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రాములు తెలిపారు. ఇప్పటికే మద్దూరు నుంచి లింగల్ చేడ్ వరకు రోడ్డు విస్తరణపై సర్వే చేశామన్నారు. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి అంచన వ్యయాలను అధికారికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కోస్గి(మద్దూరు): పీఆర్టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి శుక్రవారం సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సంఘం 52వ వార్షికోత్సవం సందర్భంగా వీటిని మండల ప్రజాప్రతినిధులకు, అధికారులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సంతోష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

మాగనూర్: మండల పరిధిలోని మారెమ్మవ్వ అమ్మవారి హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు లెక్కించారు. మొత్తం లక్షా తొంబై రెండు వేలు నగదు వచ్చినట్లు తెలిపారు. మండల ప్రజలే కాకుండా అమ్మవారిని మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రరాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రతి మంగళ, శుక్రవారాలలో వచ్చి దర్శించుకోనున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సుభిక్ష అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేకల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని గ్రామానికి చెందిన పోతుల శ్రీను భార్య శారదమ్మకు శుక్రవారం సుభిక్ష అగ్రి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆమె జీవనోపాధికోసం 8మేకలను అందించారు. గత కొన్నిరోజుల క్రితం ఆర్థిక పరిస్థితులతో మనస్తాపం చెందిన పోతుల శ్రీను ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి శారదమ్మకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆయన భార్య శారదమ్మ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ అతి కష్టంగా పిల్లలను పోషిస్తుంది. ఈ విషయమై బాధితురాలికి జీవనోపాధికి సుభిక్ష అగ్రిఫౌండేషన్ వారు మేకలను అందించినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ శ్యాం తెలిపారు. కార్యక్రమంలో రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు శిక్షణ తరగతులు



అధికారులతో భవన నిర్మాణ కార్మికులు

మరికల్: మండలంలోని తీలేర్‌లో తెలంగాణ బిల్డింగ్ ఆథర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డ్, లేబర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తాపీ మేస్త్రీలకు నైపుణ్య శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు శివశంకర్ గంగధర్‌గౌడ్ మాట్లాడుతూ 15రోజుల పాటు జరిగే శిక్షణ కాలంలో మేస్త్రీలకు పనులు చేసే విధానంలో నైపుణ్యాలు, మెలుకువలు నేర్పించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి 15 రోజులకు గాను ఒక్కొక్క కార్మికుడికి రూ.4500 ఎన్‌ఏసీ ద్వారా సర్టిఫికెట్‌తో అందజేస్తామన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

మక్తల్: పట్టణంలోని బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణమచారి తనిఖీ చేశారు. ఈ మేరకు.. హాస్టళ్ల వంటగదిని పరిశీలించి మాట్లాడారు.. విద్యార్థులకు మెనూప్రకారం మధ్యాహ్నభోజనం వడ్డించాలని సిబ్బందికి సూచించారు.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ వమాసూమ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశవర్కర్లు

నారాయణపేట: ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు.. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ జిల్లా వెంకట్రామరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రాం హాజరై మాట్లాడారు.. ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో ధర్నాకు వచ్చిన తహసీల్దార్ రానా ప్రతాప్‌కి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాల్‌రాం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నారాయణపేటలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం జీఓ నంబర్ 69ను అమలుకు జీఓ 14 విడుదల చేసినందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సదాశివారెడ్డి, మహ్మద్‌సలీంలు మాట్లాడుతూ.. పేట –కోడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2495 కోట్ల నిధులు మంజూరు చేయడం ఈ ప్రాంత ప్రజలకు శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.సుధాకర్, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.మనోహర్ ప్రసాద్‌గౌడ్, కౌన్సిలర్ మహేశ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: 69 జీఓ అమలు చేయడంపై మండలంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్కోటి నారాయణ రెడ్డి, మణెమ్మ, వెంకటేష్‌గౌడ్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: 69 జీఓ అమలు చేయడంపై పట్టణంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కోళ్ల వెంకటేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ కుమార్, రవికుమార్, గోవర్ధన్, రవికుమార్, మామిళ్ల కిష్టప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దామరగిద్ద: పేట –కోడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2495 కోట్ల నిధుల మంజూరుతో జీఓ 14ను జారీ చేయడంపై మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు.. మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్ హన్మంతు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ జారీతో నిధులు మంజూరు చేయడంతో పేట ప్రజలకు ఎంతో సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. హన్మంతు, మాజీ ఎంపీటీసీ జయదేవ్ రెడ్డి, శరణ్య నాయక్, సురేష్, ఖాజా పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

మరికల్: కొడంగల్–నారాయణపేట, మక్తల్ మూడు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయడంతో శుక్రవారం కాంగ్రెస్ ఏబీసీ సెల్ జిల్లా చైర్మన్ కృష్ణయ్య, నాయకులు హరిష్, రామకృష్ణ హర్షవ్యక్తం చేశారు. మూడు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎం రేవంత్ నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇందకు కృషిచేసిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



దామరగిద్దలో దరఖాస్తులను పరిశీలిస్తున్న పీడీ

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. శుక్రవారం మండలంలోని బాపన్‌పల్లిలో డీఆర్‌డీఓ పీడీ గోపాల్‌నాయక్ దరఖాస్తులను పరిశీలించారు. అంతకుముందు మండల కేంద్రంలోని పంచాయతీలో అంగన్‌వాడీ టీచర్‌లకు రూ. 500కే సిలిండర్ పథకంలో భాగంగా దరఖాస్తుదారులు ఇచ్చిన గ్యాస్ కనెక్షన్ నంబర్‌ల పరిశీలన, గృహలక్ష్మి వంటి పథకాల పరిశీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్ అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వాటిలో కొన్ని తప్పులు జరిగిన వాటిని సరిచేస్తున్నట్లు ప్రత్యేక అధికారి సుదర్శన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ మొత్తం మండలంలో 4800 దరఖాస్తులు తప్పులు ఉన్నాయని వాటిని ప్రతి గ్రామంలో సిబ్బందిని ఉంచి తప్పులు జరిగిన దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్లి సరిచేస్తునట్లు తెలిపారు. ఇప్పటివరకు 1400మంది దరఖాస్తులు సరిచేశామని మిగితా వాటిని త్వరగా పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ సుదర్శన్ పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితమే జీఓ 69 సాకారం



సమావేశంలో మాట్లాడుతున్న నామాజీ

నారాయణపేట రూరల్: తెలంగాణ ప్రభుత్వం నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం అమలుకు నిధులు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ, రతంగపాండురెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యమ ఫలితంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి పనులు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ నిర్ణయం హర్షణీయమని, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

– జీఓ 69 అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షణీయమని జలసాధన సమితి కన్వీనర్ కెంచె శ్రీనివాసులు, కో కన్వీనర్ నర్సింహ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో బాలిక మండలిలు ఏర్పాటు



విద్యార్థులతో టీం సభ్యులు

కోస్గి(మద్దూరు): కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింత ఉన్నత పాఠశాల, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా సంక్షేమా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలికల మండలిని ఏర్పాటు చేశారు. నిడ్జింతలో 2, కొత్తపల్లిలో 1 మండలిని ఏర్పాటు చేసినట్లు జిల్లా మహిళా సాధికారత కేంద్ర ఆర్థిక నిపుణుడు విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఈ మండలి చేయాల్సిన పనులను విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా బాల్య వివాహాలను అరికట్టడం, చదువుమధ్యలో అపివేయకుండా చూడడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన..



కోస్గిలో మెమోంటో ఇస్తున్న డీఈఓ, తదితరులు



మరికల్‌లో విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

కోస్గి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ పోటీలో మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వప్న ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం తెలిపారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహించగా నీటి సంరక్షణను వివరిస్తూ విద్యార్థిని స్వప్న పాడినపాటతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ మేరకు డీఈఓ అబ్దుల్ ఘని, ఏఎంఓ విద్యాసాగర్, ఇతర అధికారులు స్వప్నతోపాటు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు మల్లేశంలకు ప్రశంస పత్రంతోపాటు మెమెంటో అందజేశారు. 28న రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థికి అభినందన

కోస్గి(మద్దూరు): ఈ నెల 28 సైన్స్ డేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గీతాంజలి ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి అనిల్‌నాయక్ మొదటి స్థానం సాధించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు విద్యార్థి ఎంపిక కావడంతో డీఈఓ అబ్దుల్ ఘని, ఏఎంఓ విద్యాసాగర్ ఇతర అధికారుల చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని పొందాడు. ఈ విద్యార్థిని పాఠశాల యాజమాన్యం విజయ్‌కుమార్, వెంకటయ్య, అభినందించారు.

మరికల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిల్లో నిర్వహించిన సైన్స్ పోటీలో తీలేర్ విద్యార్థిని బుజ్జమ్మ రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనూరాధ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేస్తాం



నారాయణపేటలో ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న నాయకులు, ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఓ ప్రైవేటు బీఈడీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆ సంఘం ఆవిర్భావ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, వివిద మండలాల అధ్యక్షులు రఘువీర్, జనార్ధన్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నర్వ: నిరంతరం ఉపాధ్యాయుల సమస్య సాధనే ధ్యేయంగా పీఆర్టీయూ పనిచేస్తుందని మండల అధ్యక్షుడు సూరం వెంకటేష్ అన్నారు. శుక్రవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల సముదాయ సమావేశంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యాయులు హరిశంకర్, గీత, స్వాతి, రాధిక, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో శుక్రవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రబాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.